# ఛత్తీస్‌గఢ్‌లో మరో కుంభకోణం!

- రైస్ మిల్లింగ్ ప్రోత్సాహకం క్వింటాల్‌కు రూ.40 నుంచి రూ.120కి పెంపు
- రైస్ మిల్లర్ల నుంచి రూ.175 కోట్ల వసూళ్లు
- 'ప్రభుత్వ పెద్దలకు' పెద్ద ఎత్తున ముడుపులు!
- కాంగ్రెస్ పాలిత రాష్ట్రంలో వరుస స్కామ్‌లు

న్యూఢిల్లీ, అక్టోబర్ 24: కాంగ్రెస్ పాలిత ఛత్తీస్‌గఢ్‌లో మరో కుంభకోణం వెలుగులోకి వచ్చింది. రూ.175 కోట్ల మేర రైస్ మిల్లింగ్ స్కామ్ జరిగిందని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) సోమవారం ఆరోపించింది. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని మార్క్‌ఫెడ్ మాజీ మేనేజింగ్ డైరెక్టర్, రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కీలక సభ్యుడొకరు రైస్ మిల్లర్ల నుంచి దాదాపు రూ.175 కోట్ల మేర లంచాల రూపంలో వసూలు చేశారని, వీటిని పలువురు ప్రభుత్వ పెద్దలకు చెల్లించినట్టు పేర్కొన్నది. మార్క్‌ఫెడ్ మాజీ ఎండీ మనోజ్ సోనీ, రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్‌కు చెందిన ట్రెజరర్ రోషన్ చంద్రశేఖర్, కొంత మంది ఆఫీస్ బ్యారర్లు, జిల్లా మార్కెటింగ్ అధికారులు, పలువురు రైస్ మిల్లర్ల యాజమానుల ఇండ్లు, కార్యాలయాల్లో ఈ నెల 20, 21 తేదీల్లో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. పలు పత్రాలు, డిజిటల్ పరికరాలను, లెక్కలు చూపని రూ.1.06 కోట్ల నగదును స్వాధీనం చేసుకొన్నట్టు ఈడీ పేర్కొన్నది. రాజకీయ నేతలు, అధికారులు పరస్పర అవగాహనతో ఈ కుంభకోణానికి పాల్పడినట్టు గుర్తించినట్టు తెలిపింది. గత కొద్ది నెలలుగా రాష్ట్రంలో బొగ్గు రవాణా పన్ను, మద్యం, అక్రమ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ స్కామ్‌లను బయటపెట్టినట్టు ఈడీ పేర్కొన్నది.

**ఐటీ ఫిర్యాదు ఆధారంగా..**

రాయ్‌పూర్ కోర్టులో ఆదాయ పన్ను శాఖ చేసిన ఫిర్యాదు ఆధారంగా ఈడీ తాజా చర్యలు చేపట్టింది. బియ్యం మిల్లింగ్ కోసం రాష్ట్ర ప్రభుత్వం రైస్ మిల్లర్లకు చెల్లించే క్వింటాల్ వరికి రూ.40 చొప్పున ఇచ్చే ప్రత్యేక ప్రోత్సాహకాన్ని దుర్వినియోగం చేసేందుకు మార్క్‌ఫెడ్ అధికారులతో ఛత్తీస్‌గఢ్ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు కుమ్మక్కయ్యారని ఐటీ తన ఫిర్యాదులో పేర్కొన్నది. ప్రోత్సాహకం కింద అందించే మొత్తాన్ని రూ.40 నుంచి ఏకంగా రూ.120కు పెంచారని, దీన్ని రెండు విడతల్లో రూ.60 చొప్పున చెల్లించారని ఈడీ వెల్లడించింది. ఈ క్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ సభ్యులు, మార్క్‌ఫెడ్ అధికారి మనోజ్ సోనీ కలిసి రైస్ మిల్లర్ల నుంచి వారు మిల్లింగ్ చేసిన ప్రతి క్వింటాల్ వరికి ఒక విడత చెల్లింపునకు రూ.20 చొప్పున లంచాలు వసూలు చేశారని పేర్కొన్నది. లంచాలు చెల్లించిన రైస్ మిల్లర్ల బిల్లులనే మార్క్‌ఫెడ్ ఎండీ క్లియర్ చేసేవారని, లేకుంటే బిల్లులను నిలిపివేసినట్టు గుర్తించామని పేర్కొన్నది. ప్రత్యేక ప్రోత్సాహక పెంపుతో రూ.500 కోట్ల మేర చెల్లింపులను విడుదల చేశారని, తద్వారా లంచాల రూపంలో రైస్ మిల్లర్ల నుంచి రూ.175 కోట్లను రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ట్రెజరర్ రోషన్ చంద్రశేఖర్ వసూలు చేశారని, ఈ మొత్తాన్ని 'ప్రభుత్వ పెద్దలకు' చేరవేశారని ఆరోపించింది. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరుగనున్న విషయం తెలిసిందే.





వరవరరావుకు హైదరాబాద్‌లో

## కంటి శస్త్రచికిత్స

**బాంబే హైకోర్టు అనుమతి**

ముంబై, అక్టోబర్ 24 : ఎల్గార్ పరిషత్-మావోయిస్టులతో సంబంధాల కేసులో నిందితుడు, రచయిత వరవరరావు హైదరాబాద్‌కు వెళ్లి కంటి శస్త్రచికిత్స చేయించుకోవడానికి బాంబే హైకోర్టు అనుమతినిచ్చింది. ఈ కేసులో బెయిల్‌పై బయట ఉన్న వరవరరావు ముంబైని విడిచి వెళ్లవద్దంటూ కోర్టు షరతు విధించిన విషయం తెలిసిందే. కంటి చూపు మందగించిందని, హైదరాబాద్‌లో శస్త్రచికిత్స చేయించుకోవడానికి అనుమతించాలని ఆయన కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విచారణ జరిపిన ధర్మాసనం.. అందుకు అనుమతి తెలిపింది.

## విద్యార్హతలపై కాంగ్రెస్ మంత్రి అబద్ధాలు!

**నాలుగు ఎన్నికల్లో నాలుగు రకాలుగా అఫిడవిట్**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): విద్యార్హతల విషయంలో రాజస్థాన్ కాంగ్రెస్ మంత్రి లాల్‌చంద్ కటారియా అబద్ధాలు.. ఇప్పుడు ఆయన మెడకు చుట్టుకున్నాయి. ఒక్కో ఎన్నికలో ఒక్కో విధంగా ఈసీకి సమర్పించిన అఫిడవిట్లో తన విద్యార్హతలను పేర్కొనటం ఆ రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. తొలుత ఇంటర్ పాసైనట్టు, ఆ తర్వాత 10వ తరగతి పాసైనట్టు.. ఇలా నాలుగు అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగు రకాలుగా తన విద్యార్హతలను వెల్లడించటం ఈసీ దృష్టికి వెళ్లింది. దీంతో కటారియాపై ఈసీ కఠిన చర్యలకు ఉపక్రమించింది. ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలీలో ఇంటర్మీడియెట్ పాసైనట్టు 2003 ఎన్నికల అఫిడవిట్‌లో ఆయన తెలిపారు. 2008 ఎన్నికల్లో 10వ తరగతి పాసైనట్లు పేర్కొన్నారు. కటారియా పేరుతో తమ కాలేజీలో ఎవరూ చదువుకోలేదని రాయ్‌బరేలీలోని కాలేజీ ప్రిన్స్‌పాల్ ప్రకటించటంతో, ప్రతిపక్షాలు ఈసీకి ఫిర్యాదు చేశాయి.

## మధ్యప్రదేశ్ కాంగ్రెస్‌లో అసమ్మతి జ్వాలలు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ టికెట్ల పంపకం ఆ పార్టీ శ్రేణుల్లో అసమ్మతిని రాజేసింది. టికెట్లు ఆశించి భంగపడ్డ అభ్యర్థులు నిరసనలకు దిగుతున్నారు. దాదాపు 47 అసెంబ్లీ సీట్లలో వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ముఖ్యంగా పీసీసీ అధ్యక్షుడు కమలనాథ్‌తో పాటు మాజీ సీఎం, సీనియర్ కాంగ్రెస్ నాయకుడైన దిగ్విజయ్ సింగ్‌పై అసంతృప్తులు కారాలు మిరియాలు నూరుతున్నారు. కొందరు పీసీసీ కార్యాలయం ముందు దిష్టిబొమ్మలు దహనం చేస్తూ, ఫ్లెక్సీలపై బొమ్మలకు చెప్పుతో కొడుతూ తమ నిరసనలు తెలిపారు. కార్యకర్తల ఆగ్రహావేశాలను చూసి కాంగ్రెస్ అధిష్ఠానం కొన్ని చోట్ల అభ్యర్థులను మార్చే అవకాశాలున్నట్టు వార్తలు వస్తున్నాయి. రాజస్థాన్ అసెంబ్లీకి నవంబర్ 25న ఎన్నికలు జరుగనున్నాయి.




## కాబోయే ప్రధాని అఖిలేశ్ అంటూ పోస్టర్

**మరోసారి బయటపడ్డ ఇండియా కూటమి విభేదాలు**

లక్నో : ప్రతిపక్ష ఇండియా కూటమిలో విభేదాలు రోజురోజుకు ముదిరిపోతున్నాయి. దేశానికి కాబోయే ప్రధాని అఖిలేశ్ యాదవ్ అంటూ లక్నోలోని పార్టీ కార్యాలయం వద్ద భారీ పోస్టర్ వెలిసింది. దీంతో ఈ విషయం ఒక్కసారిగా రాజకీయ వేడిని రగిలించింది. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో సీట్ల పంపకాలపై కాంగ్రెస్, సమాజ్‌వాదీ మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న విషయం తెలిసిందే. 'కాబోయే ప్రధాని అఖిలేశ్ యాదవ్‌కు పుట్టిన రోజు శుభాంకాంక్షలు' అని ఆ పోస్టర్‌పై ఉన్నది. అయితే వాస్తవానికి అఖిలేశ్ పుట్టిన రోజు జూలై 1. పోస్టర్‌పై ఎస్పీ నేత రాజేంద్ర స్పందిస్తూ అఖిలేశ్ ప్రధాని కావాలన్నది కార్యకర్తల కోరికని చెప్పారు. బీజేపీ స్పందిస్తూ 'అది అఖిలేశ్ అనుచరుల కల అయి ఉండొచ్చు. ఇదే సమయంలో ఇండియా కూటమిలోని ఇతర సభ్యులపై ఒత్తిడి పెంచే వ్యూహం కావొచ్చు' అని పేర్కొంది.

## రాజస్థాన్‌లో భార్యాభర్తల మధ్య పోటీ!

**మరో చోట భార్యకు నిరాకరించి భర్తకు టికెట్**

జైపూర్, అక్టోబర్ 24: రాజస్థాన్‌లో ఒక మహిళ ఏకంగా సిట్టింగ్ ఎమ్మెల్యే అయిన తన భర్తపైనే పోటీకి దిగింది. దంత రామ్‌గర్ నియోజకవర్గంలో ఈ ఆసక్తికరమైన పోటీ జరుగుతున్నది. ఇక్కడ కాంగ్రెస్ నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే వీరేంద్ర సింగ్ పోటీలోకి దిగనుండగా, అతని భార్య రీటా చౌదరి మాత్రం జేజేపీ అభ్యర్థిగా రంగంలోకి దిగారు. తన మనస్సాక్షి చెప్పిన విధంగానే నడుచుకుంటానని, అందుకే జేజేపీ పార్టీలో చేరానని ఆమె చెప్పారు. తన నిర్ణయాన్ని ప్రజలు ఆమోదించారని, ఈ ఎన్నికల్లో తప్పక విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు, అల్వార్ రామ్‌గర్ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే షఫియా జుబైర్‌కు అధికార కాంగ్రెస్ టికెట్ నిరాకరించి ఆమె భర్త, మాజీ ఎమ్మెల్యే జుబేర్ ఖాన్‌కు పార్టీ తరపున అవకాశం కల్పించింది. దీనిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేసింది.

# మళ్లీ గెలిపిస్తేనే..!

**రైతు రుణమాఫీపై ఛత్తీస్‌గఢ్ సీఎం బఘేల్ అవే అబద్ధాలు**

- మళ్లీ అధికారమిస్తే సంపూర్ణ రుణమాఫీ అంటూ హామీ
- 2018లో చేసిన మోసాన్ని గుర్తుచేసుకొంటున్న రైతన్నలు
- కాంగ్రెస్‌కు ఇంకోసారి ఓటేయబోమంటూ ప్రమాణాలు
- తెలంగాణలో సంపూర్ణ రుణమాఫీ చేసిన సీఎం కేసీఆర్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): ఛత్తీస్‌గఢ్ కాంగ్రెస్‌పై అక్కడి ప్రజలు, రైతన్నలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఓట్లు అడిగేందుకు రావద్దంటూ కోర్బా జిల్లాలోని రామ్‌పూర్ సహా పలు గ్రామాల్లో ఏకంగా బ్యానర్లను ఏర్పాటుచేసి తమ నిరసనను తెలియజేశారు. దీంతో రాష్ట్రంలో ఎలాగైనా అధికారాన్ని నిలబెట్టుకోవాలనుకొంటున్న కాంగ్రెస్.. హామీల వర్షాన్ని కురిపిస్తున్నది. కులగణన, ధాన్యం సేకరణ, పేదలకు ఇండ్ల నిర్మాణం తర్వాత రైతుల రుణాన్ని ఇంకోసారి మాఫీ చేస్తామంటూ మరో హామీని గుప్పించింది. ఈ మేరకు బఘేల్ ఎక్స్ వేదికగా ప్రకటించారు. అయితే, రుణమాఫీ విషయంలో గతంలో మోసం చేసిన కాంగ్రెస్ సర్కారుకు మళ్లీ ఓటేయబోమంటూ రైతన్నలు ప్రమాణాలు చేస్తున్నారు.

**అలా మోసం చేశారు**

అధికారంలోకి వచ్చిన పది రోజుల్లోనే రైతు రుణాలన్నీ మాఫీ చేస్తామని 2018లో హామీ ఇచ్చిన కాంగ్రెస్ దాన్ని నిలబెట్టుకోలేకపోయింది. 35 లక్షల మంది రైతుల రుణాలన్నీ మాఫీ చేస్తామన్న ఆ పార్టీ.. 13.46 లక్షల మంది రైతులు సహకార బ్యాంకుల్లో తీసుకున్న రూ. 5,260 కోట్ల విలువ చేసే స్వల్పకాలిక రుణాలనే చెల్లించింది. పబ్లిక్ సెక్టార్ జాతీయ బ్యాంకులు, రాష్ట్ర గ్రామీణ బ్యాంకులు, వాణిజ్య బ్యాంకుల్లో రైతులు తీసుకొన్న రుణాలను మాఫీ చేయలేదు. అంతేకాదు, 2019లో సీఎం బఘేల్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది నుంచి రుణమాఫీ ఉండబోదని తేల్చిచెప్పారు. దీంతో పలువురు రైతులు ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అయినప్పటికీ, సర్కారు రుణమాఫీపై ముందుకు కదల్లేదు. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో మళ్లీ అధికారాన్ని అప్పగిస్తే రుణమాఫీ చేస్తామంటూ కాంగ్రెస్ అబద్ధపు హామీలు గుప్పిస్తున్నది.




## తెలంగాణలో రుణమాఫీ ఇలా

ఒకవైపు కాంగ్రెస్ పాలనలోని ఛత్తీస్‌గఢ్‌లో రైతు రుణమాఫీ దుస్థితి అలాగుంటే, మరోవైపు కేసీఆర్ పదేండ్ల పాలనలో తెలంగాణలో రైతు రుణమాఫీ సంపూర్ణమైంది. రూ.లక్షలోపు పంట రుణాలను మాఫీ చేస్తామని 2014లో ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ నెరవేర్చారు. 2018లో మరోసారి రుణమాఫీకి హామీ ఇచ్చారు. ఈ మేరకు ఈ రెండు దఫాల్లో మొత్తం 40.74 లక్షల మంది రైతులకు సంబంధించిన రూ. 17,351 కోట్ల పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. 29.61 లక్షల రైతు కుటుంబాలకు చెందిన రూ.19 వేల కోట్ల రుణాలను మాఫీ చేయనున్నట్టు గత ఆగస్టులో మరోసారి కేసీఆర్ హామీ ఇచ్చారు. దీంతో తెలంగాణలో రైతు రుణమాఫీ సంపూర్ణమయినట్లయింది.

**తెలంగాణలో రైతు రుణ మాఫీ వివరాలు**

| సంవత్సరం | రైతుల సంఖ్య | చేసిన రుణమాఫీ |
|---|---|---|
| 2014 (లక్షలోపు) | 35,31,913 | రూ. 16,144.1 కోట్లు |
| 2018 (36 వేలలోపు) | 5,42,609 | రూ. 1,207.37 కోట్లు |
| 2023 (37 వేలు-లక్షలోపు) ఆగస్టు 15నాటికి | 10,79,721 | రూ. 6,546.05 కోట్లు |
| పదేండ్లలో మొత్తం రుణమాఫీ | 51,54,243 | రూ. 23,879.53 కోట్లు |

## చెరకు రైతుల సమస్యలను పరిష్కరించాలి

**బీఆర్‌ఎస్ నేత రఘునాథ్ దాదా పాటిల్**

ముంబై, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో చెరకు రైతులకు టన్నుకు రూ.5వేలు గిట్టుబాటు ధర చెల్లించాలని, రంగరాజన్ కమిటీ సిఫారసు ప్రకారం చక్కర కార్ఖానాల మధ్య నిర్దిష్ట దూరం షరతును రద్దు చేయాలని బీఆర్‌ఎస్ నాయకులు, షెత్కారి సంఘటన్ అధ్యక్షులు రఘునాథ్ దాదా పాటిల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం పుణెలోని చక్కెర కమిషన్ కమిషనర్ డాక్టర్ చంద్రకాంత్ పులకుండవార్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రఘునాథ్‌దాదాతో పాటు బీఆర్‌ఎస్ నాయకులు శివాజీ నాందకిలే, వస్తాదు దౌండ్‌కర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాటిల్ మాట్లాడుతూ.. చెరకు రైతుల బకాయిలను చెల్లించాలని కోరారు. హైకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల చెరకు రైతులకు ఒకే రకమైన ధర ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## చెరకు వ్యర్థాలను కాల్చడంతో కూలీలకు కిడ్నీ వ్యాధులు

న్యూఢిల్లీ, , అక్టోబర్ 23: వ్యవసాయ కూలీలకు మూత్రపిండాల వ్యాధులు సంక్రమించడానికి ఇతర కారణాలతో పాటు మరో కారణం కనిపిస్తున్నది. చెరకు తోటలోని వ్యర్థాలను, వరి చేలలోని ఊక, దుబ్బులను కాల్చడం వల్ల విడుదలయ్యే విషపూరిత పదార్థాలు కిడ్నీ వ్యాధులకు దారి తీస్తున్నట్లు తెలుస్తున్నది. భారతదేశం, శ్రీలంక, అమెరికా వంటి దేశాల్లో ఈ పరిస్థితి ఉన్నట్లు కొలరాడో విశ్వవిద్యాలయానికి చెందిన పరిశోధన బృందం అధ్యయనంలో వెల్లడైంది.

## చార్‌ధామ్ యాత్ర నవంబర్ 18న ముగింపు

డెహ్రాడూన్: చార్‌ధామ్ యాత్ర నవంబర్ 18న ముగియనున్నది. ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ దేవాలయాన్ని నవంబరు 18న మధ్యాహ్నం 3.33 గంటలకు మూసివేయడంతో ఈ యాత్ర ముగుస్తుంది. ఈ వివరాలను శ్రీ బద్రీనాథ్-కేదార్‌నాథ్ దేవాలయాల కమిటీ చైర్మన్ అజేంద్ర అజయ్ మంగళవారం తెలిపారు. విజయదశమి సందర్భంగా ఈ ముహూర్తాన్ని నిర్ణయించినట్లు తెలిపారు.



# కూలిన రైల్వే వంతెన

- స్లాబులు మీద పడి ఇద్దరు దుర్మరణం
- 22 నెలల్లో కూలిపోయిన పది బ్రిడ్జీలు

**ఇదీ గుజరాత్ మాడల్!**

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, అక్టోబర్ 24 (నమస్తే తెలంగాణ): బీజేపీపాలిత గుజరాత్‌లో ఘోరం జరిగింది. నిర్మాణంలో ఉన్న రైల్వే ఓవర్‌బ్రిడ్జి కూలిపోవడంతో ఇద్దరు వ్యక్తులు దుర్మరణంపాలయ్యారు. బనస్కాంత జిల్లా పాలన్‌పుర్‌లో సోమవారం ఈ ఘటన జరిగింది. పాలన్‌పుర్-అంబాజీని కలిపేందుకు నిర్మిస్తున్న ఈ వంతెన కోసం వారం క్రితమే ఆరు కాంక్రీటు స్లాబులు నిర్మించారు. సోమవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి ఆటోలో వంతెన కింది నుంచి వస్తున్నాడు. ఇంతలో స్లాబులు పడిపోవడం గమనించిన అతను.. ఆటోను వదిలి, ప్రాణాలు కాపాడుకొనేందుకు పరిగెత్తాడు. కానీ, ఆలస్యమవ్వడంతో శిథిలాల కింద నలిగిపోయి, ప్రాణాలు విడిచాడు. ఈ దృశ్యాలు అక్కడి సీసీటీవీలో రికార్డయ్యాయి. శిథిలాల కింద చిక్కుకొని మరొకరు కూడా మరణించినట్టు పోలీసులు తెలిపారు. ఇటీవల వేసిన స్లాబులు కూలిపోవడంతోనే ఈ దుర్ఘటన జరిగినట్టు కలెక్టర్ వరుణ్‌కుమార్ బరన్‌వాల్ తెలిపారు. కాగా గత అక్టోబర్‌లో గుజరాత్‌లోని మోర్బీలో వంతెన కూలిన ఘటనలో 135 మంది మరణించడం తెలిసిందే.

**రెండు నెలలకో బ్రిడ్జి**

గుజరాత్‌లో ఇటీవల కూలిన కొన్ని వంతెనలు



- డిసెంబర్, 2021: మమతాపుర్ బ్రిడ్జి, అహ్మదాబాద్
- ఆగస్టు, 2022: హట్‌కేశ్వర్ బ్రిడ్జి, అహ్మదాబాద్
- అక్టోబర్, 2022: మోర్బీ బ్రిడ్జి, మోర్బీ
- డిసెంబర్, 2022: అటల్ బ్రిడ్జి, వడోదరా
- జూన్, 2023: రైల్వే ఓవర్‌బ్రిడ్జి, వల్సాద్
- జూన్, 2023: మిందోలా బ్రిడ్జి, తపీ
- జూన్, 2023: వరియావ్ బ్రిడ్జి, సూరత్
- జూన్, 2023: శాస్త్రీ బ్రిడ్జి, అహ్మదాబాద్
- సెప్టెంబర్, 2023: బస్తాదీ బ్రిడ్జి, బస్తాదీ
- అక్టోబర్ 2023: పాలన్‌పుర్ బ్రిడ్జి, పాలన్‌పుర్

## 'రథ్ ప్రభారిస్' చట్టవిరుద్ధం

- ఐఏఎస్‌లతో పథకాల ప్రచారమా?
- ఇది ఓటర్లను ప్రభావితం చేయడమే
- ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమే
- కేంద్రంపై ఈఏఎస్ శర్మ ధ్వజం
- కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ



శర్మ

న్యూఢిల్లీ : తమ పథకాలపై ఐఏఎస్ స్థాయి ఉన్నతాధికారుల చేత ఊరూరా తిరుగుతూ ప్రచారం చేయించాలని కేంద్రంలోని మోదీ సర్కార్ తీసుకొన్న నిర్ణయంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం అవుతున్నాయి. ఐఏఎస్ అధికారులను 'రథ్ ప్రభారిస్(ప్రత్యేక అధికారులు)గా నియమించడం అనైతికం, చట్ట విరుద్ధమని మాజీ సీనియర్ ఉన్నతాధికారి, కేంద్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఈఏఎస్ శర్మ పేర్కొన్నారు. పథకాలపై ప్రచారం పేరుతో ఓటర్లను ప్రభావితం చేసేందుకు అధికారులను రంగంలోకి దించడం ఎన్నికల చట్టాలను ఉల్లంఘించడమేనని అభిప్రాయపడ్డారు. మోదీ సర్కార్ ఇచ్చిన ఉత్తర్వులను నిలిపివేసేందుకు జోక్యం చేసుకోవాలని కోరుతూ కేంద్ర ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. ప్రభుత్వ పథకాలను ప్రమోట్ చేస్తూ దేశవ్యాప్తంగా సెల్ఫీ పాయింట్లు ఏర్పాటు చేయాలని, అందులో మోదీ ఫొటో పెట్టాలని కేంద్రం ఇటీవల సైనిక అధికారులకు ఆదేశాలు ఇవ్వటం తీవ్ర దుమారం రేపింది.

**ప్రత్యేక రథాల్లో తిరుగుతూ ప్రచారం..**

పలు విభాగాలకు చెందిన ఉన్నతాధికారులను 'రథ్ ప్రభారిస్'లుగా నియమించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల నిర్ణయం తీసుకొన్నది. వచ్చే నెల నుంచి వికసిత్ భారత్ సంకల్ప్ యాత్ర పేరుతో దేశంలోని 2.69 లక్షల గ్రామ పంచాయతీలను కవర్ చేస్తూ 765 జిల్లాల్లో ప్రత్యేకంగా రూపొందించిన రథాల్లో తిరుగుతూ ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయాలని ఆదేశాలు జారీచేసింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత.. ఇటువంటి ఉత్తర్వులు ఇవ్వడం కోడ్‌ను ఉల్లంఘించినట్టేనని ఈఏఎస్ శర్మ ఓ ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. ఓటర్లను ప్రభావితం చేసే కార్యక్రమాల్లో అధికారులు పాల్గొనకూడదని సివిల్ సర్వీసెస్ నిబంధనలు చెబుతున్నాయని అన్నారు. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో నలుగురు కేంద్ర మంత్రులు పోటీచేస్తున్నారని, ఓ వైపు ఎన్నికల కోడ్ అమల్లో ఉండగా.. తమ అధికారులతో వారి నియోజకవర్గాల్లో ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయించడం సరికాదని అభ్యంతరం వ్యక్తం చేశారు.

## అలా వీఆర్‌ఎస్.. ఇలా క్యాబినెట్ ర్యాంక్

**మాజీ ఐఏఎస్‌కు కీలక పదవి ఇచ్చిన ఒడిశా సీఎం**

భువనేశ్వర్: రాజీనామా చేసిన కొద్ది గంటలకే ఒక ఐఏఎస్ అధికారిని ఒడిశా సీఎం అందలం ఎక్కించారు. ఆయన్ను క్యాబినెట్ మంత్రి హోదా ఉన్న 5టీ చైర్మన్‌గా నియమించారు. ఐఏఎస్ వీకే పాండ్యన్ కొద్ది రోజుల క్రితమే స్వచ్ఛంద పదవీ విరమణకు దరఖాస్తు చేయగా.. ఆమోదం లభించిన వెంటనే పట్నాయక్ ఆయనను 5టీ నబిన్ ఒడిశా స్కీమ్‌కు చైర్మన్‌గా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కొత్త పథకానికి పాండ్యన్ స్టేట్ ఇన్‌చార్జిగా ఉంటారని ప్రభుత్వం ప్రకటించింది. పాండ్యన్ త్వరలోనే అధికార బీజేడీలో చేరవచ్చని పార్టీ వర్గాలు తెలిపాయి. సీఎం కార్యాలయంలో 2011లో చేరిన పాండ్యన్ సీఎం కార్యదర్శిగా పనిచేశారు. కాగా, పాండ్యన్ ఎంపికను విపక్షాలు తీవ్రంగా దుయ్యబట్టాయి.



## బీజేపీకి నటి గౌతమి రాజీనామా

న్యూఢిల్లీ : తమిళనాడుకు చెందిన ప్రముఖ సినీ నటి గౌతమి బీజేపీకి రాజీనామా చేశారు. తనను మోసం చేసిన వ్యక్తికి కొందరు సీనియర్ బీజేపీ నాయకులు అండగా నిలిచారని ఆవేదన వ్యక్తం చేశారు. అలగప్పన్ అనే వ్యక్తి తన ఆస్తిని అక్రమంగా కాజేయడానికి ప్రయత్నిస్తున్నాడని గౌతమి తెలిపారు. కష్టకాలంలో ఉన్న తనకు పార్టీ నాయకులు అండగా ఉండకుండా మోసం చేసిన వ్యక్తికి మద్దతునిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. 2021 తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఇస్తామని హామీ ఇచ్చి.. మోసం చేశారని కూడా ఆమె ఆరోపించారు. ఇలాంటి పార్టీలో ఇక కొనసాగలేనని, అందుకే రాజీనామా చేశానని వెల్లడించారు.

## ఊహించినదాని కన్నా.. చంద్రుడు 4 కోట్ల ఏండ్లు పెద్ద

**446 కోట్ల ఏండ్ల క్రితం ఆవిర్భావం: తాజా అధ్యయనం**

న్యూఢిల్లీ: చంద్రుడి ఆవిర్భావం గురించి తాజా పరిశోధన సరికొత్త విషయాన్ని బయటపెట్టింది. చంద్రుడి వయసు మనం ఊహించినదాని కన్నా 4 కోట్ల సంవత్సరాలు ఎక్కువగా ఉందని ఫీల్డ్ మ్యూజియం, గ్లాస్గో వర్సిటీ పరిశోధకులు కనుగొన్నారు. 1972లో అపోలో వ్యోమగాములు చంద్రుడిపై నుంచి తీసుకొచ్చిన రాళ్లపై ప్రయోగాలు జరిపిన పరిశోధకులు ఈ విషయాన్ని తెలిపారు. సౌర కుటుంబంలో మార్స్ పరిమాణంలో ఉన్న ఖగోళ వస్తువు 442 కోట్ల సంవత్సరాల క్రితం భూమిని ఢీకొనగా, భూమి నుంచి చంద్రుడు ఏర్పడ్డాడన్నది ఇప్పటివరకు ఉన్న అంచనా. 'ఖగోళ వస్తువు ఢీకొన్నప్పుడు ఆ వేడికి రాళ్లు కరిగి.. స్ఫటికాలుగా ఏర్పడ్డాయి. చంద్రుడిపై లభించిన జిర్కాన్ స్ఫటికాలు ఇలా ఏర్పడ్డవే' అని ప్రొఫెసర్ ఫిలిప్ హెక్ అన్నారు. దీనిని బట్టి చంద్రుడు వయసు 442 కోట్ల ఏండ్లు కాదు.. 446 కోట్ల సంవత్సరాలు ఉంటుందని సైంటిస్టులు అంచనావేశారు.

## విదేశీ పౌరసత్వాల్లో భారతీయులే టాప్

న్యూఢిల్లీ: అమెరికా సహా ఆర్గనైజేషన్ ఫర్ ఎకనమిక్ కోఆపరేషన్ అండ్ డెవలప్‌మెంట్(ఓఈసీడీ) కూటమి దేశాలకు వలస వెళ్తున్న వారిలో భారతీయులు ముందు వరుసలో ఉన్నారు. పౌరసత్వం పొందడంలోనూ వారిదే అగ్రస్థానమని అని ఓఈసీడీ తాజా నివేదిక పేర్కొన్నది. అమెరికా పౌరసత్వం పొందుతున్న వారిలో భారతీయులే అత్యధికమని తెలిపింది.

| ఓఈసీడీ దేశాల పౌరసత్వం తీసుకొంటున్న వారు | | భారతీయులు పౌరసత్వం తీసుకుంటున్న టాప్ దేశాలు | |
|---|---|---|---|
| దేశం | 2021 | దేశం | 2021 |
| భారత్ | 1,32,795 | అమెరికా | 56,000 |
| మెక్సికో | 1,18,058 | ఆస్ట్రేలియా | 24,000 |
| సిరియా | 1,03,736 | కెనడా | 21,000 |